కథా నిలయం
6057
శ్రీకాకుళం

# ఎవరు పిలిచినా ఆ రెండక్షరాలే...!

అవని కాన్వాసు మీద రసరమ్య రేఖని చిత్రీకరిస్తూ వెళ్తోన్న కుంచెలా రోడ్డుమీద అలవోకగా సాగిపోతోంది కారు.

ప్రకృతి పురుషుడి కుంచెలోంచి జాలువారిన వృక్షాలు సైతం అపభ్రంశంచెంది మహాచిత్రకారుడికి స్వాగతం పలుకుతున్నట్లుగా పక్కకి వైదొలగి వెనక్కి జరిగిపోతున్నాయి వినయంగా.

దృశ్యీకరించబడ్డ రేఖలు రకరకాల రంగుల్ని పులుముకొని శోభాయమానమై వెలుగొందినట్లు...

అన్వేష్ గుండె పలుఅనుభూతుల్ని రంగరించుకొని ఆనందడోలికల్లో తేలియాడు తోంది.

హరివిల్లు విరిసి అందాల్ని సంతరించుకున్న ఆకాశంలా... ప్రకృతంతా ఎంతో ఆహ్లాదకరంగా వుంది. సగం తెరిచివుంచిన బ్యాక్‌గ్లాస్ విండోని పూర్తిగా డౌన్‌చేసి, చూపు సారించి బయటి దృశ్యాల్ని తిలకిస్తుండిపోయాడతను.

అలా ఆసక్తిగా చూస్తుండిపోయిన వాడల్లా... రోడ్డు మలుపులో సడెన్‌బ్రేక్ పడడంతో... అతని నుదురు విండో అంచులకి కొట్టుకుంది.

వెన్వెంటనే "అమ్మ్...మ్మా!!" అనే సన్నని కేక అతడి స్వరపేటిక నుండి పైకెగసింది.

"అమ్మా...!!" అనే పిలుపు ఓంకారనాదమై హృదిగదిలో ప్రతిధ్వనించింది.

ఏ నోట పలికినా...ఎవరు పిలిచినా... ఆ రెండక్షరాలే కదా !

అంసకల్పితంగా అన్వేష్‌కి తను గీచిన పెయింటింగ్ గుర్తుకొచ్చింది.

గర్భంలోవుండగానే-తల్లి రక్తమాంసాలు పంచుకొని...ఊపిరి పీల్చుకొని... అణువణువూ అందుకొని...

కళ్ళు తెరిచాక కూడా- అమ్మ పొత్తిళ్ళలో చేరి... ఆమె స్తన్యాన్ని గ్రోలి, శిశువు పాలు తాగుతూ మైమరిపోవాలని కేరింతలు కొడుతుంటే...ఆ స్పర్శకి పరవశించే ఆ కన్నతల్లి... బిడ్డవంక వాత్సల్యపూరితంగా చూస్తూ...

"అమ్మా...!!" అనే స్వరాన్ని ఆలపించలేని ఆలేతపెదాలకి...తన ప్రేమాభిమానాలని స్తన్యంగా మార్చి...మమతానురాగాల మురిపాలనే పాలుగా అందించే... ఆ కమనీయ అనుబంధ బాంధవ్యాన్ని అపురూప కళాఖండంగా మలిచాడు !!!

"అంబా...!!" అని అరుస్తూ, గంతులేస్తూ వచ్చి అమ్మచెంత చేరి... పొదుగుని కుదుపుతూ...

పాలుతాగే లేగ దూడ తనువుని లాలనగా నిమిరే... ఆవు అనురాగాన్ని అద్భుతంగా చిత్రీకరించాడు !!!

పచ్చని చెట్టుకొమ్మమీది గూడు లోంచి " కిచ-కిచ...!!"మని నోరుతెరచి అరుస్తోన్న బిడ్డకి...నోట కరుచుకొచ్చిన ఆహారాన్ని...అప్యాయంగా అందిస్తోన్న పిచ్చుక మమకారాన్ని... అనిర్వచనీయ దృశ్యచిత్రంగా ఆవిష్కరించాడు !!!

ఈ మూడు చిత్రాల్ని కలిపి త్రిచిత్రమాలికగా తీర్చిదిద్దాడు. వినూత్న రీతిలో సాగిన ఈ చిత్రాలకి కళాభిమానులనుండి అనూహ్య స్పందన లభించింది.

నిజమైక కళాకారుడికి కావల్సిందదేగా !

తరిగిపోతున్న మానవ విలువల్ని... క్రమక్రమంగా అదృశ్యమైపోతున్న అనుబంధాల అంతరంగాల్ని...మనుషుల మధ్యనుండి వైదొలగిపోతున్న రాగబంధాల్ని...కమనీయంగా గుండె పొరలకతికింపచేసినందుకు... అన్వేష్ వేనోళ్ళ కొనియాడబడ్డాడు.

'ఎవరు పిలిచినా ఆ రెండక్షరాలే...!' అనే కాప్షన్‌తో గీచిన ఆ పెయింటింగ్‌కి రాష్ట్రప్రభుత్వం నుండి ప్రత్యేక ప్రశంస లభించడం అతడికి మరపురాని మధురానుభూతి అయితే-ఆ రివార్డ్‌ని ముఖ్యమంత్రి చేతులమీదుగా అందుకోబోవడం అన్వేష్‌కి ఊపిరి సలపనంత ఆనందాన్ని కలిగిస్తోంది. ఆ అవార్డ్‌ని స్వీకరించడానికే ఈ ప్రయాణం !!

ఎన్ని వేనవేల రోజుల తపనోకదా...! ఈ మధురానుభూతికి మూలం ! ఎన్ని లక్షల ఘడియల పరివేదనోకదా...?! ఈ వరానికి ఆకారం !

ఏ వేదన అతన్ని మలిచిందో...?! ఏ శిశిరపు ఆవేదనలోంచి నవవసంతం మొలిచిందో...?!

ఆమనికోయిల మధుమాస గీతం ఆలపించినట్లు-అన్వేష్ జీవనం సరికొత్త గమనం

శ్రుతిచేసుకుని...

ఈ నాటికి సుస్వరమైన... అతడి జీవితాన్ని స్పృశించింది.

కడలి ఘోషలోంచి ఎగిసిన అలలు... కెరటపురేఖలై కదలి... తీరాన్ని అల్లుకుంటూ... అపురూపదృశ్యాల్ని సాక్షాత్కరింపచేసినట్లు అతడి బాల్యపు అంతరంగ అంతర్మథన లోతుల్లోంచి... ఓ అద్భుత కళానైపుణ్యుడు ఊపిరి పోసుకున్నాడు.

★ ★ ★

వెన్నెల కలువ విరబూస్తున్నవేళ చూస్తే... అతడికి ఎన్నెన్ని చిత్రాలు చిత్రాతి చిత్రంగా తోచేవని...??

గాలి తనను తాను కుంచెగా మలచుకొని...నీలి ఆకాశపు తెరమీద రంగురంగుల మబ్బుతునకల్ని పేర్చుతూ... రమణీయంగా చిత్రిస్తోన్న అరుదైన చిత్రాలు...పుంఖానుపుంఖాలుగా అతడి కంటి పొరలపై తారాట్లాడేవి...!!

ఎన్నెన్నో అనూహ్య భావాలు ఆ లేతగుండెలో ఉవ్వెత్తున ఎగిసిపడి మదిని స్పందింపచేసేవి.

ఇసుకతిన్నె కాగితమై పరుచుకుంటుంటే...మేఘ మాలికల స్ఫూర్తితో... ఆచిన్నారి అన్వేష్ చూపుడు వేలుగీచే గీతలమధ్య...అస్పష్టదృశ్యాలు అద్భుతంగా ఒదిగిపోయేవి.

చిత్రాలు గీసేయాలన్న బలమైన తపన అనుక్షణం అతని అంతరంగంలో సుడులు తిరుగుతోంటే క్లాసులో మాస్టారు చెప్పే నోట్స్‌రాయడం మానేసి, ఆయన హావభావాల్ని తదేకంగా గమనిస్తుండేవాడు.

బాహ్యప్రపంచాన్ని మరచి అన్వేష్ ఆయన రూపాన్ని అస్పష్టంగా తనకాపీలో బంధించే ప్రయత్నంలో నిమగ్నమై వుండేవాడు.

ఒకనాడిలాగే... నోట్స్ చెప్పడం ఎప్పుడు పూర్తయిందో తెలీదు. చప్పున అన్వేష్‌ని పిలిచి "నీ నోట్స్ చూపవోయ్?!" అంటూ అడిగాడాయన.

సమాధానంగా బిక్కమొహం వేశాడాకుర్రాడు. చేతులు కట్టుకుని మాస్టారిముందు మౌనంగా నిలబడ్డాడు.

చెవిపట్టిమెలివేస్తూ "భడవా ! పాఠం రాసుకోమంటే నాబొమ్మ గీస్తావుట్రా" అంటూ చితక బాదేశాడు.

అన్వేష్ ప్రోగ్రెస్ రిపోర్ట్... మేస్టారి సపోర్ట్‌లతో...ఇంట్లో అమ్మ మౌనంగా మందలించేది. కొడుకు కనుపాపల్లోని రేఖల్ని గుర్తించి.. బేలచూపుల్లోని తపనని పసిగట్టినదానిలా-

"బొమ్మలు గీస్తే గీచావ్ ! చదువు మానేస్తే ఎట్లా...? నాలో సత్తువ వున్నంతకాలం ఈ రెక్కల కష్టంతో నిన్ను పోషిస్తాను. నాగుండెల్లో పెట్టుకొని పెంచుతాను. ఏ వేళ ఎలాంటిదో ఎవరు చెప్పొచ్చారు. హఠాత్తుగా నా ఊపిరి దీపం ఆరిపోతే!... తండ్రి దిక్కుకూడా లేనివాడివి ఎట్లారా నాన్నా...!!?"

-అంటూ తన ఆవేదనని ఆచిన్నారి బుర్రకి అర్థమయ్యేలా చెప్పేది.

బిడ్డ చూడడంలేదనుకొని... ఓ కన్నీటి పొర... ఆమె కనురెప్పలమాటున ఆర్తిగా రెపరెపలాడ్తోంటే... తెలుసుకున్న ఆ పసిమనసు తల్లడిల్లేది.

కొడుకు సుఖపడడంకోసం తాను కష్టపడేదా ఇల్లాలు. పిల్లవాడు ఏదడిగినా కాదనకుండా కొనిపెట్టేది. బిడ్డబ్రతుకు దేదీప్యమానంగా వెలగాలని ఆమె వత్తయి కరిగింది. కన్నపేగు కళకళలాడుతూ వుండడం కోసం... ఆ కన్నతల్లి తన జీవనాన్ని ఆర్ద్రతాభరితం చేసుకుంది.

అందుకే అన్వేష్‌కి అమ్మంటే ప్రాణం !! అతడి శ్వాస అమ్మ రక్తమాంసాల్లోని అణువణువూ తల్లివాత్సల్యానికి కరిగిపోయిందే!

అలాంటి అమ్మ...

'అమ్మా...!!' అని పిలిచినా పలకలేని దూరలోకానికి తరలివెళ్ళిన క్షణాన

అన్వేష్ కళ్ళు కన్నీటి చెలిమలై పారలేదు. గుండె కరిగి శోకమై విలపించలేదు.

"బాగా చదువుతూనే... చక్కని బొమ్మలు గీయరా కన్నా!! నీవు మంచి బొమ్మలు గీసి... నీకు బోల్డంత పేరొస్తే...కనులారా చూడాలనివుందిరా నాన్నా!!" అంటూ అమ్మ తన అక్కున చేర్చుకొని ప్రేమగా హత్తుకున్న దృశ్యం... ఆ కుర్రాడి మదిలో మెదలుతుంటే... కర్తవ్యం వెన్నుతట్టింది.

అమ్మ కోరినకోరిక...అతని జీవితాశయమై వేళ్ళూనుకుంటుంటే... ఆ ఆశయం అన్వేషిని ఆఊరికి దగ్గరి పట్నంవైపుకి మళ్ళించింది.

ఆ పట్నంలో దారీ తెన్నూ తెలియక... ఒంటరిగీతలా వీధులవెంట తిరుగాడుతుంటే-

ఓ చోట... రోడ్డుమీద చిత్రాలు ఆ పసిమనసుని అమితంగా ఆకర్షించాయి.

అన్వేష్ కళ్ళు సుద్దముక్కలతో గీయబడిన ఆ రోడ్డుమీద చిత్రాల సౌందర్యాన్ని, చిత్రకారుడి కళాహృదయాన్ని రంగుల లాలిత్యాన్ని, ఆర్తిగా తడుముతుంటే అమ్మే కబురంపిందో... ఆవీధి చిత్రకారుడే గుర్తించాడో... అన్వేష్‌ని చేరదీశాడతను.

నా అనేవాళ్ళెవ్వరూ లేని ఆ నిరుపేద చిత్రకారుడు అన్వేష్‌ని తనవాడిగా చేసుకున్నాడు. అన్వేష్‌లో విద్వత్తుని గుర్తించి... కళని తట్టి... కళాతృష్ణని పెంచి... ఆ కుర్రాడు ఇంతటి వాడవడానికి కారకుడయ్యాడు.

"చదువు ఈసారి తప్పితే తప్పేవు. కానీ నీ మార్గాన్ని తప్పకు. నీ లక్ష్యం మరల్చకు. నీ ధ్యేయం ఎప్పటికీ మరవకు..." అన్న అమ్మ దీవెన ఈనాటి అన్వేష్ ఉన్నతస్థితికి పరోక్ష కారణమయ్యింది.

ఈ సమయంలో అమ్మేవుంటే ఎంత ఆనందించేదో...?! అమ్మ కోరిన చిన్న కోరిక కదూ...!? తనింత నాడినవ్వాలని !!

ఏదీ మరీనాడు అమ్మలేదే...?! ఈ కన్నపేగుని కన్నీళ్ళతో మెలిపెట్టేసి... అర్థాంతరంగా వెళ్ళిపోయావు...?!

విషాదపు మరకని నా హృదిపటలానికి అతికించి... కదిలివెళ్లేవు...!

నా జీవితానికి అర్థాన్ని... పరమార్థాన్ని... ఆపాదించి... " నా ఆత్మని నీ కుంచెగా మలచుకో బిడ్డా!" అంటూ అదృశ్యమైపోయావు.

తనకోసం కష్టపడి కరిగిపోయిన తల్లి... ఈ అనుభూతిని పంచుకోవడానికి తన వెంట లేదనే భావన అన్వేష్ గుండెని తొలిచేస్తుంది. మనసంతా వేదనాభరితమై పోయి అమ్మ జ్ఞాపకాలతో తనువంతా బరువెక్కి పోయింది. చెమర్చిన కళ్ళని ఒత్తుకున్నాడతను.

ఇంతలో -

కీచుమంటూ రొదపెడుతూ... సడెన్‌గా ఆగిపోయింది కారు.

ఆలోచనలు చెల్లాచెదురవడంతో అన్యమనస్కుడైన అన్వేష్ ఉలిక్కిపడ్డాడు. ఏం జరిగిందోనని తలవంచి విండో నుండి ఆత్రుతగా తొంగిచూశాడు.

కారుకి అడ్డంగా ఎవరో రావడంతో డ్రైవర్ సడెన్‌బ్రేక్ వేసినట్టున్నాడు.

కారుని ఆఫ్‌చేసి వెళ్ళి వాళ్ళని తీవ్రంగా మందలిస్తున్నాడు డ్రైవర్. వాళ్లు ఎదురువాదిస్తూ తిరగబడలేదుగానీ...

ఏదో అర్థిస్తున్నారతన్ని. ఒక ఆడ-మగ వున్నారు. బ్యాక్‌డోర్ తెరచి అన్వేష్ కారులోంచి దిగి వెళ్లాడక్కడికి. అన్వేష్‌ని చూడగానే వాళ్ళతో వివాదమాపి,

"సార్ !... లిఫ్ట్ కావాలంటున్నారు..." డ్రైవర్ విషయం చెప్పేడు.

గోచి పెట్టుకున్న నడివయస్కురాలైన ఆడమనిషి అతని చెంతకు వచ్చి-

"దొరా !...నీ కాల్మొక్త. నా సంటిది నొప్పుల్తో బాధపడ్తోంది. ఒక్కటి ఇటేపొత్తలేదు... ఎర్ర బసోల్లు ట్రైక్ సేత్తున్నరట... కడుపులోని బిడ్డ తిరగబడినట్టుంది. దవుఖానకు తీసుకు పోవాల..." అంటూ కాళ్ళమీద పడబోతోంటే డ్రైవర్ అడ్డుపడి "వెళ్ళు... వెళ్ళవమ్మా ! అయ్యగారు అర్జంటుగా హైదరాబాద్ వెళ్ళాలి, ఈసరికే లేటయ్యింది..." అంటూ విసుగ్గా అరిచాడు.

అన్వేష్ వారించాడతన్ని. "పోన్లే శీనూ ! ముగ్గురేగా... వెంట తీస్కెళ్దాం. మధ్యలో ఏదైనా హాస్పిటల్ దగ్గర డ్రాప్ చేద్దాం..." అన్నాడు.

"అదికాద్సార్... ముందు కెళితే ఇరవై ముప్పై కిలో మీటర్ల దాకా అన్నీ చిన్న చిన్న పల్లెటూర్లే ! హాస్పిటల్ అంటే తప్పనిసరిగా వెనక్కి వెళ్ళాలి..."

అన్వేష్ ఆలోచనకి తావివ్వకుండానే-

"అమ్మ్...మ్మా !" అనే మూలుగులు వినిపించి చూశాడటువైపు !

ఆ గర్భిణీ స్త్రీలో ఓ అమ్మే కనపడిందో... తన తల్లే అగుపించిందో... "మీ అమ్మాయిని వెనకకూచోబెట్టండి" స్థిరంగా అన్నాడు అన్వేష్.

"సార్ ! ఇలా అయితే ఫంక్షన్‌కి వెళ్లలేం. మిస్సవుతాం..." అన్నాడు డ్రైవర్.

అదేమీ పట్టించుకోకుండా వెళ్ళి ఫ్రంట్‌సీట్లో కూచున్నాడు అన్వేష్.

"నీ కడుపు సల్లంగుండ దొరా !..." అనే ఆ తల్లిదీవెన గుండెలో మార్మోగుతుంటే శూన్యంలోకి చూస్తుండిపోయాడు. ఆ ఆర్తులు వెనక సీట్లో సర్దుకోవడం అయ్యాక.... కారు నెమ్మదిగా వెనక్కి మళ్ళీ స్పీడందుకుంది.

'ఓ తల్లి ప్రేమమీద అపురూప చిత్రాన్ని గీచి అవార్డ్ గెల్చుకున్న తను... తల్లి కాబోతున్న మరో అమ్మ తన కళ్ళముందరే విలపిస్తోంటే... విడిచి ఎలా వెళ్ళగలను?!... ఆ అవార్డ్ కంటే అపురూపమా... ఈ అమ్మకి చేసే సాయం!

సెంటిమెంట్ గుప్పించి చిత్రాన్ని గీసే తను... సెంటిమెంట్‌ని వీడి... సిమెంట్ బొమ్మలా ప్రవర్తించగలడా...?! నో!... నెవ్వర్ !!

తన తల్లి... 'ప్రేమ'ని'కీర్తి'ంచడం నేర్పింది కానీ...'కీర్తి'ని ప్రేమించమనలేదు...!!

ఆ క్షణంలో అన్వేష్ అంతరంగంలో ఓ అభిప్రాయం వేళ్ళూనుకుంది-

'మనసు పొరల్ని కాన్వాసుగా పరచుకొని... గుండెని కుంచెగా మలచుకొని... మానవత్వపు రేఖల్ని గీచుకొనే ప్రతి వ్యక్తి... ఓ మాననీయ చిత్రకారుడే !!'

నిజమే !

కళాకారుడి అంతరంగంలో పరిమళించిన మానవత్వం... కేవలం కళవరకే పరిమితం కాకూడదు...

అది ఆవిష్కరింపబడి ఆచరణాత్మకం కావాలి... అప్పుడే ఏ కళ అయినా గుబాళిస్తుంది...!!